# ప్రజల సహకారంతోనే అభివృద్ధి

## అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ, మే 14: ప్రజల సహకారంతోనే నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. పెండింగ్ పనులను పరిష్కరించి, ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. చెప్పల్ బజార్‌లోని దశరథ్ గల్లీలో బుధవారం రూ. 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ ఉమాయాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు స్థానిక ప్రజలు పర్యవేక్షించినప్పుడే నాణ్యత ఉంటుందని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో స్థానికులను వేధిస్తున్నలో ప్రెషర్ వాటర్ సమస్య పరిష్కారంతోపాటు బస్తీ,కాలనీల అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేష్ యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్, శిరీష ఓంప్రకాష్ యాదవ్, నాగేందర్ బాబ్జి, బి.కృష్ణ గౌడ్, బబ్లు సింగ్, ఎల్.రమేష్, మహేష్ కుమార్, సుభాష్ పటేల్, బబ్బి, శ్రీకాంత్ యాదవ్, వాసు, రవి యాదవ్, అరవింద్, నర్సింగ్‌రావు, భీమ్రాజ్, రవి యాదవ్, రఘుతో పాటు స్థానికులు పాల్గొన్నారు.



చెప్పల్‌బజార్ దశరథ్‌గల్లీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్, తదితరులు



జనభేరి గోడపత్రిను ఆవిష్కరిస్తున్న బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్

## 28న జనభేరి బహిరంగ సభ

రవీంద్రభారతి, మే14 : వనపర్తి జిల్లాలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకై ఈ నెల 28న వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జనభేరి బహిరంగ సభ పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్‌గౌడ్ చెప్పారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జనభేరి బహిరంగ సభ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో పాండురంగ యాదవ్, చింతపల్లి సతీష్ గౌడ్, గోటూరి రవీందర్, గూడుషా, దేవర శివ, అంజన్నయాదవ్, ధర్మేంద్రసాగర్, రామన్‌గౌడ్, నరసింహయాదవ్, అనిల్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత సదుపాయాలను వినియోగించుకోవాలి

కాచిగూడ, మే 14: గత కొన్నేళ్లుగా కాచిగూడ హర్రస్ పెంటలోని ప్రసన్నాంజనేయ దేవాలయంలో పేదలకు అందిస్తున్న ఉచిత ఫిజియోథెరపీ, వైద్య శిబిరం, కుట్టు శిక్షణ, మెహిందీ ప్రతివారం నగరవ్యాప్తంగా నిర్వహిస్తున్న పలు వైద్య శిబిరాలు, యోగ తదితర ఉచిత సదుపాయాలు పేద లు సద్వినియోగం చేసుకోవాలని హిందూ శ్మశాన వాటిక ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు రాజేందర్ పటేల్ విజ్ఞప్తి చేశారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పేద ప్రజల కోసం లక్షలు వెచ్చించి ఈ వైద్య శిబిరంలో ఉచితంగా మందులు, షుగరు, బ్లడ్ టెస్ట్‌లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, పాఠకుల సౌకర్యార్థం కోసం మొదటి అంతస్తుల్లో వివిధ ఆధ్యాత్మిక పుస్తకాలతో రీడింగ్ రూమ్, యోగ క్లాసులను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్ విగ్, సాయి గిరిధర్, భీమగౌని కృష్ణ గౌడ్, రతన్ విద్యాసాగర్, నందకిషోర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## అమీర్‌పేట్‌లో క్రైస్తవుల సామూహిక విందు

అమీర్‌పేట్, మే 14: అమీర్‌పేట్ డివిజన్‌లోని ఏడు చర్చిల ప్రతినిధుల సామూహిక విందు జరిగింది. వివేకానంద కమ్యూనిటీ హాల్‌లో జరిగిన విందుకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దాదాపు 350 మంది ప్రతినిధులతో విందులో అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితో పాటు క్రైస్తవ ప్రముఖులు రెవ.డా.కొత్తపల్లి సైమన్ పీటర్, రెవ.డా.రెజినాల్డ్, పాస్టర్ ప్రకాష్, పాస్టర్ సుదర్శన్, బ్రదర్ ప్రసాద్, పాస్టర్ నగరం ఫిలిప్, పాస్టర్ సురేష్ మనోహరన్, పాల్గొన్నారు. వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు సంతోష్ మణికుమార్, దాడి ప్రవీణ్‌రెడ్డి, కూతురు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# అంబర్‌పేట సమగ్రాభివృద్ధికి కృషి

## బస్తీలు, కాలనీల్లో ప్రజలకు మౌలిక వసతులు

### ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, మే 14 : అంబర్‌పేట నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్అంబర్‌పేట తదితర డివిజన్లలోని అన్ని బస్తీలు, కాలనీల్లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. నల్లకుంట డివిజన్ బజాజ్ పక్కలేన్‌లో రూ.26 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ వై.అమృతతో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానికులు కొన్ని నెలలుగా పడుతున్న ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. సంబంధిత పనులను కాంట్రాక్టర్ వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. అలాగే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అనేక అభివృద్ధి పనులను చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈ ప్రవీణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జి.శంకర్, విజయేంద్రసాగర్, సాయిని మూర్తి, నవీన్, క్రిస్టోఫర్, రమ్య, లావణ్య, ఇర్ఫానాసుల్తానా, అనిత, స్వప్న, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్ జోషి, ఎం.బీ.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ అమృతతో కలిసి నల్లకుంటలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

# బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

కాచిగూడ, మే 14: దేశానికి స్వాతంత్రం వచ్చి ఏండ్లు గడుస్తున్నా బీసీల బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందనంగా ఉందని సోషల్ డెమోక్రటిక్ జేఏసీ జాతీయ చైర్మన్ కోలా జనార్ధన్ గౌడ్ ఆరోపించారు. బుధవారం బర్కత్ పురలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, అందుకు జనాభా దామాషా ప్రకారం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. 60 శాతం ఉన్న బీసీలకు విద్యా ఉద్యోగ రంగాల్లో ఆర్టికల్ 340 ప్రకారం చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ సమస్యల పరిష్కారానికై ఈ నెల 22న ఉమ్మడి మహబూబ్ నగర్‌లోని కొత్తకోటలో వెనుకబడిన కులాల సమైక్య ఆధ్వర్యంలో బీసీ చైతన్య భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు రాజకీయాలకు అతీతంగా బీసీలందరూ పాల్గొని బీసీ నినాదం చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.చెన్నరాములు ముదిరాజ్, జాతీయ చైర్ పర్సన్ స్వరూప, సూర్యనారాయణ, రామన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆసక్తి కలిగించే రచనలు మల్లాది సొంతం



సభలో మాట్లాడుతున్న శంకర్ నారాయణ

ముషీరాబాద్, మే 14: మల్లాది రామకృష్ణశాస్త్రి రచనలు సంప్రదాయ, ఆధునికత కలబోతగా చక్కని భాషా పద ప్రయోగం పాఠకుల్లో ఆసక్తి కలిగించే విధంగా ఉంటాయని హాస్యావధాని, ప్రముఖ జర్నలిస్ట్ శంకర నారాయణ అన్నారు. త్యాగరాయ గానసభలో ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా విఖ్యాత కవి పండితుడు మల్లాది రామకృష్ణశాస్త్రి యాదిలో సంస్మరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా శంకర నారాయణ పాల్గొని మల్లాది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ భాషలే కాకుండా విదేశీ భాషల్లో సాధికారత గల బహుభాషా విజ్ఞాని అని అన్నారు. ఆయన రచించిన కథలు తెలుగు భాషకు ప్రామాణికంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, గాయకులు శ్రీమణి, ధారా సుబ్రహ్మణ్యం, మల్లం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జియాగూడ మూసీనదిలో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ బోయిని దర్శన్

## మూసీనదిలో గుర్రపు డెక్క తొలగింపు

జియాగూడ, మే 14 : ప్రజలకు దోమల బెడద లేకుండా జియాగూడ మూసీనదిలో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులను చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని జియాగూడ డివిజన్ కార్పొరేటర్ బోయిని దర్శన్ అన్నారు. బుధవారం ఎంటామాలజీ సిబ్బందితో కలిసి డివిజన్ పరిధిలోని పురానాపూల్ నుంచి కేశవస్వామినగర్ వరకు గల మూసీనది నీటిలో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బోయిని దర్శన్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో గత కొంత కాలంగా దోమల వ్యాప్తి ఎక్కువగా ఉండడంతో ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదుల కారణంగా నిత్యం మూసీనది పరివాహక ప్రాంతాల్లో పరిశుభ్రత, గుర్రపు డెక్క తొలగింపు పనులను చేపడుతున్నామన్నారు. డివిజన్‌ను అనుకుని మూసీనది ఉండడంతో దోమల విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా దోమలు సైర్యవిహారం చేస్తున్నాయన్నారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో సీసీల పాత్ర కీలకం



మెహిదీపట్నం పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న దక్షిణ పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్

మెహిదీపట్నం, మే 14 : శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు పాత్ర కీలకంగా ఉంటుందని దక్షిణ పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ అన్నారు. బుధవారం మెహిదీపట్నం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 123 సీసీ కెమెరాలు డీసీపీ చంద్రమోహన్,అదనపు డీసీపీ ఇక్బాల్ సిద్ధికి, ఏసీపీలు విజయ్‌శ్రీనివాస్, సయ్యద్ ఫయాజ్, ము నావర్‌లతో కలిసి ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్లు మల్లేష్, రమేష్‌నాయక్, రాజు పాల్గొన్నారు.

## వీరజవాన్లకు ప్రముఖుల శ్రద్ధాంజలి



ఊరేగింపులో పాల్గొన్న ఓల్డ్ సిటీ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అబిడ్స్, మే 14: సైనికుల సాహసంతోనే భారత్ ఎంతో పటిష్టంగా, సురక్షితంగా ఉందని ఓల్డ్ సిటీ వాకర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బి. ఉమేష్ గౌడ్ అన్నారు. ఆదివారం లాల్ దర్వాజాపూల్ బాగ్ జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్‌లో ఓల్డ్ సిటీ వాకర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాక్, భారత్ దేశాల మధ్య జరిగిన యుద్ధంలో 14 మంది పాక్ సైనికులను చంపిన తెలుగు జవాన్ అమరవీరులు మురళీ నాయక్ మరియు సచిన్ యాదవులకు శ్రద్ధాంజలి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. భారత్ నిర్వహించిన దాడులు దేశం గర్వపడేలా చేశాయన్నారు. దేశ భద్రత, ఆత్మ గౌరవం, నైతిక విలువలు కాపాడే ప్రయత్నంలో భాగంగా ప్రతి భారతీయుడు భారత సైన్యం కోసం భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఆల్ ఇండియా రేడియో రిటైర్డ్ టెక్నికల్ ఆఫీసర్ టీ.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడడంలో సైనికుల సేవలు అభినందనీయమని, కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న కొన్ని గంటల గడవకముందే పాక్ దొంగబుద్ధి చూపిందని సరిహద్దుల వెంట డ్రోన్ల దాడులు చేస్తుందని ఈ వ్యవహారం క్షమించరానిదని ఆవేదన వ్యక్తం చేశారు. భారత సరిహద్దుల్లో జరిగిన కాల్పుల్లో అసువులు బాసిన భారత వీర జవాన్లకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రముఖ ఆర్య సమాజ్ ప్రచార కార్యదర్శి, జాతీయ యోగ గురువు ఎస్.రామకృష్ణశాస్త్రి అమరవీరుల జవాన్లపై శాంతి పార్ట్ చేసి గేయాలను పాడి శ్రద్ధాంజలి ఘటించారు. రఘు, శేఖర్, ఎం కిరణ్ చారి, సురేందర్,ఆంజనేయులు చారి,శశిధర్‌చారి, వెంకటేష్, హనుమంత్ రెడ్డి, గిరీష్ బాబు, శ్రీనివాస్ చారి విజయ్ కుమార్, రాజ ప్రభు, బాక్సింగ్ కోచ్ ప్రతాప్ ప్రదీప్ జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు.

## మణికొండ డాలర్స్ కాలనీలో హైడ్రా కమిషనర్ పర్యటన

మణికొండ, మే 14 : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్ హిల్స్ కాలనీలో స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం పర్యటించారు. పార్కు స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నాయని డాలర్ హిల్స్ కాలనీవాసులు హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో కమిషనర్ రంగనాథ్ స్వయంగా చేరుకొని పార్కు స్థలం కబ్జా అయిన ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం నిర్మాణదారులు మాట్లాడుతూ పార్కు స్థలం తాము కొనుగోలు చేయలేదని, డబ్బులు పెట్టి ల్యాండ్ కొనుగోలు చేసి ప్రభుత్వ అనుమతులు పొంది నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు.ఇరువర్గాల వాదనలు విన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇరు వర్గాల మధ్య ఉన్న డాక్యుమెంట్స్ పరిశీలించి, మీటింగ్ ఏర్పాటు చేసి అనంతరం సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చాంద్రాయణగుట్ట, మే 14: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం(55) లభ్యమైన సంఘటన రెయిన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో జాఫర్ రోడ్, ఐసీఐసీఐ బ్యాంకు ఏటీఎం ముందర గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం రోడ్డు పై పడి ఉంది. పోలీసులు చుట్టూ పక్కల వారిని విచారించగా ఎవరు మృతదేహాన్ని గుర్తుపట్టలేదు. అనంతరం మృతదేహాన్ని పోలీసులు ఉస్మానియా మార్చురీలో భద్రపరిచారు. ఎవరైనా ఈ మృతుడిని గుర్తుపట్టినచో రెయిన్ బజార్ పోలీసులను సంప్రదించాలన్నారు.

## అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 100కు సమాచారమివ్వాలి



ఆకస్మిక తనిఖీలు చేస్తున్న పోలీసులు

బొల్లారం,మే 14: అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరిస్తే డయల్ 100కు సమాచారం అందించాలని బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు తెలిపారు. బుధవారం బోయినపల్లి సీఐ తిరుపతి రాజు, డీఐ సర్దార్‌నాయక్ ఆధ్వర్యంలో బోయినపల్లిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. గణేష్ పాన్‌షాప్ చౌరస్తా, న్యూబోయినపల్లి చౌరస్తా, సెవెన్ టెంపుల్, జయనగర్, కంసారి బజార్‌లలో పర్యటించారు. ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో ప్రయాణికులను లగేజీ, బ్యాగులను పరిశీలించి తనిఖీలు నిర్వహించారు. మీ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, వస్తువులు కనిపించినా, ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వ్యక్తులు అనమానాస్పదంగా కనిపించినా 100 డయల్‌కు సమాచారం అందించాలని సూచించారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా, ప్రజల భద్రత కోసం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ, పోలీసుల సిబ్బంది తెలిపారు.

# టోలిచౌకి పోలీస్‌స్టేషన్‌లో మరమ్మతులు



కొనసాగుతున్న మరమ్మత్తులను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్

మెహిదీపట్నం, మే 14: నూతనంగా ఏర్పాటు చేసిన టోలిచౌకి పోలీస్‌స్టేషన్లో సౌకర్యాల కోసం మరమత్తులు కొనసాగుతున్నాయి.

పది రోజుల క్రితం ప్రారంభమైన పోలీస్‌స్టేషన్లో ఇంకా పూర్తిస్థాయిలో సౌకర్యాలు సమకూర లేదు. టోలిచౌకి అజీజ్ బాగ్‌లో ఉన్న దుబాయ్ హౌస్‌లో టోలిచౌకి పోలీస్‌స్టేషన్ ప్రారంభమైంది. ప్రస్తుతం టోలిచౌకి పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్, అదనపు ఇన్‌స్పెక్టర్లతోపాటు ఐదుగురు ఎస్సైలు, ఆరుగురు ఏఎస్ఐలు, ఏడుగురు హెడ్ కానిస్టేబుల్, 36 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల కోసం, సిబ్బంది కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టడానికి ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్ కృషి చేస్తున్నారు. త్వరలో పూర్తిస్థాయిలో పోలీస్ స్టేషన్‌లో సౌకర్యాలు ఏర్పాటు అవుతాయని చెప్పారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమను సంప్రదించాలని ఆయన సూచించారు.

# రోడ్డుపైనే డ్రైనేజీ నీరు.. ఇబ్బందుల్లో ప్రజలు



రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

కాచిగూడ, మే 14: గత కొన్ని రోజులుగా నింబోలిఅడ్డలోని పాత ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదురుగా రోడ్డుపై డ్రైనేజీ నీరు పొంగి పొర్లుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆ దారిన పోయే బాటసారులు, ద్విచక్ర వాహనదారులకు దుర్వాసన వ్యాపించి అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ రోడ్డు గుండా ప్రతిరోజు దాదాపు వేలాదిమంది ప్రయాణికులు, వాహనదారులు, బస్సులు, లారీలు, వివిధ ప్రాంతాలకు వెళ్తుంటాయి. రోడ్డుపై ప్రవహించే మురుగు నీటి గుండా వాహనాలు వెళ్తుండడంతో పాదచారులపై డ్రైనేజీ నీరు పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నింబోలిఅడ్డ రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## దూరవిద్య ఎంసీఏ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే ఎంసీఏ కోర్సు రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.in లో చూసుకోవాలని సూచించారు.

## బీఎఫ్ఏ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎఫ్ఏ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఏ (అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్, ఫోటోగ్రఫీ) రెండు, నాలుగు, ఆరు, ఎనిమిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 27లోగా సంబంధిత కళాశాల ల్లో చెల్లించాలని చెప్పారు. రూ. 500 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవాలని సూచించారు.

## కలుషిత నీటి సరఫరా..



హరినగర్‌లో కలుషిత నీటి సరఫరా చూపుతున్న మహిళలు

ముషీరాబాద్, మే 14: రాంనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కలుషిత నీటి సరఫరా స్థానికులను ఆందోళన గురి చేస్తోంది. పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేసిన జలమండలి అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోకుండానే నీటి సరఫరా చేయడంతో మురుగునీరు సరఫరా అవుతోంది. ఇటీవల సాగర్‌లాల్ ఆసుపత్రి వద్ద భారీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టిన అధికారులు,జాగ్రత్తలు తీసుకోకుండానే నీటి సరఫరా చేశారు. దీంతో పలు బస్తీలకు కలుషిత నీటి సరఫరా జరిగింది. బీఆర్ఎస్ నాయకులు మురళి, నీలాదేవి సమస్యను జలమండలి డీజీఎం తీసుకువెళ్లడంతో సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు.

## ఏసీ, ఫ్రిడ్జ్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ

బన్సీలాల్‌పేట్, మే 14: వేసవి సెలవుల్లో ఉన్న విద్యార్థులు, నిరుద్యోగులకు సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఎస్. నరసింహ మూర్తి తెలిపారు. ముషీరాబాద్ చౌరస్తా సమీపంలో, భోలక్‌పూర్‌లోని తమ శిక్షణ కేంద్రంలో నెల రోజుల పాటు ఇచ్చే శిక్షణలో ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, ఎయిర్ కూలర్, గీజర్ల రిపేరింగ్ నేర్పిస్తామని అన్నారు. అలాగే, 15 రోజులపాటు హోమ్ క్లీనింగ్ కోర్సు గురించి ఉచిత శిక్షణ ఇచ్చి, అనంతరం సర్టిఫికెట్ కూడా అందిస్తామని ఆయన తెలిపారు.18 ఏళ్ల నిండిన వారు ఎవరైనా చేరవచ్చని ఆయన అన్నారు. ఇతర వివరాలకు 81068 87523లో సంప్రదించాలని ఆయన కోరారు.

## పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడి

బంజారాహిల్స్,మే 14: పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి యువతిపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడడంతో పాటు డబ్బులు తీసుకుని ఉడాయించిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే..ఢిల్లీ సమీపంలోని ఘజియాబాద్ ప్రాంతానికి చెందిన యువతి(28) ఎంబీబీఎస్ పూర్తిచేసి కాస్మోటాలజీలో స్పెషలైజేషన్ చేసింది. బంజారాహిల్స్‌లోని ఓ సంస్థలో స్కిన్ అండ్ హెయిర్ స్పెషలిస్ట్‌గా ఆరునెలల క్రితం చేరింది. అదే సంస్థలో హెచ్‌ఆర్ హెడ్‌గా పనిచేస్తున్న భరత్ (33) అనే వ్యక్తితో పరిచయం ఏర్పడిం ది. యువతిని ప్రేమిస్తున్నానని నమ్మించడంతో పాటు పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. కొన్నాళ్ల తర్వాత వీరిద్దరినీ ఉద్యోగంలో నుంచి తీసేయడంతో బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లో సొంతం గా వ్యాపారం ప్రారంభించారు. దీనికోసం యువతివద్దనుంచి భరత్ సుమారు రూ.2.5 లక్షలు తీసుకున్నాడు. కాగా ఇటీవల భరత్‌కు ముందే పెండ్లి అయిందని తేలడంతో అతడు నివాసం ఉంటున్న ప్లాట్‌కు వెళ్లి చూడగా ఆరునెలల గర్భంతో ఉన్న భార్య కనిపించింది. తనను మోసం చేసిన భరత్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత యువతి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బీఎన్ఎస్ 69 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.